క్లుప్తంగా

జాతీయ రహదారి పక్కన ఆక్రమణల తొలగింపు



సత్తెనపల్లి: పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఆక్రమణలను మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు మంగళవారం తొలగించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగల గో సంరక్షణ శాల కాంప్లెక్స్ వద్ద నుంచి ఆక్రమణల తొలగింపు ప్రారంభించారు. కాగా ముందస్తు సమాచారం లేకుండా కనీసం కొంత సమయం కూడా ఇవ్వకుండా ఉన్నపళంగా పొక్లెయినర్‌తో పగలగొడుతున్నారని కొందరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే మరికొందరు రోడ్లపైకి ఉన్నా కూడా వారి జోలికి వెళ్లకుండా తమపై ప్రతాపం చూపుతున్నారని ప్రశ్నించారు. ప్రణాళిక అధికారులు మాత్రం వరుసగా రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని, రహదారిపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడతామని అంటున్నారు.

మాదిపాడుకు బస్సు ట్రిప్పులు పెంచండి



అచ్చంపేట: సత్తెనపల్లి నుంచి అచ్చంపేట మీదుగా మాదిపాడు పోవు బస్సు ట్రిప్పులను పెంచాలని, ఉన్న బస్సులు సకాలంలో వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని చిగురుపాడు సర్పంచ్ గంధం కోటేశ్వరరావు, సాగునీటి సంఘం అధ్యక్షుడు పసుపులేటి పాపిరెడ్డి మంగళవారం సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజరుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పాపిరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రమైన అచ్చంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మాదిపాడు నుంచి వచ్చే విద్యార్థులతో పాటు వివిధ పనులపై మండల కార్యాలయాలకు, బ్యాంకులకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని, అందువల్ల ఉన్న ట్రిప్పులను సకాలంలో నడిపి, అదనపు ట్రిప్పులు కూడా వేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తిరువాయిపాటి ఆంజనేయులు ఉన్నారు.

క్రోసూరు ఐసీడీఎస్ కార్యాలయం క్రోసూరులోనే పెట్టండి

క్రోసూరు: క్రోసూరు మండలానికి కేటాయించిన సమగ్ర శిశు సంక్షేమ సేవా పథకం (ఐసీడీఎస్) కార్యాలయాన్ని ఇప్పటికీ పెదకూరపాడు మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామం నుంచి నిర్వహిస్తున్నారని వెంటనే క్రోసూరులోనే ఏర్పాటు చేయాలని మానవ హక్కుల సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిర్రా రాజేష్‌కుమార్ అధికారులకు అర్జీ అందజేశారు. ఈ మేరకు ఆయన క్రోసూరు తహసీల్దార్ వెంకట నాగరాజు, ఎంపీడీవో రవికుమార్‌లను కలిసి కార్యాలయ తరలింపు అవసరాన్ని వివరించారు. త్యాళ్లూరులో శిథిల భవనంలో కొనసాగుతుందని, అధికారులు తక్షణమే స్పందించి ఐసీడీఎస్ కార్యాలయాన్ని క్రోసూరులో ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

క్రోసూరు ఏడీఏగా మస్తానమ్మ



క్రోసూరు: క్రోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులుగా మస్తానమ్మ సోమవారం బాధ్యతలు తీసుకున్నట్లు ఏవో వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. నరసారావుపేట జిల్లా కార్యాలయం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారని, ఇక్కడ ఏడీఏగా పనిచేసిన హనుమంతరావు నరసారావుపేట జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ ఏడీఏగా బదిలీ అయినట్లు చెప్పారు. క్రోసూరు, బెల్లంకొండ, అచ్చంపేట, రాజుపాలెం మండలాలకు ఏడీఏగా పని చేస్తారు. ఈ సందర్భంగా ఆయా మండలాల ఏవోలు ఏడీఏ కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

రహదారికి కూటమి గ్రహణం

- ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.149 కోట్లతో చేపట్టిన పనులు
- క్రోసూరు నుంచి గుంటూరు వెళ్లే ప్రజలకు ప్రధాన రహదారి
- అలాగే అచ్చంపేట, అమరావతి రీచ్‌ల నుంచి ఇసుక రవాణాకూ ఆధారం

అమరావతి-బెల్లంకొండ డబుల్ రోడ్డు పూర్తికాక అవస్థలు



విప్పర్ల వద్ద రోడ్డు



దొడ్లేరు వైపు రోడ్డు పరిస్థితి

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గానికి అమరావతి నుంచి బెల్లంకొండ వరకు డబుల్ రోడ్డు (45 కి.మీ.) తలమానికంగా మారుతుందని భావించిన ప్రజలు రోడ్డు పనులు పూర్తికాకపోవటంతో అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరావు నదీతీర గ్రామాల అభివృద్ధికి అమరావతి-బెల్లంకొండ డబుల్‌రోడ్డు అత్యవసరంగా భావించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, రూ.149 కోట్ల నాబార్డు నిధులతో డబుల్‌రోడ్డు మంజూరు చేయించారు. 2023 జూన్ నెలలో మాజీ సీఎం జగన్ చేతుల మీదుగా రోడ్డు శిలాఫలకం ప్రారంభించారు. టెండర్ల ప్రక్రియ అనంతరం 2024 జనవరిలో రోడ్డు పనులు ప్రారంభించారు.

ఇదే ప్రధాన రహదారి

క్రోసూరు నుంచి అమరావతి మీదుగా గుంటూరు వెళ్లే ప్రజలకు అమరావతి-బెల్లంకొండ రోడ్డు ప్రధాన రహదారి. అదే విధంగా మండలంలోని ఏడు గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగానే నిత్యం రాకపోకల కొనసాగించాలి. అంతేకాక అచ్చంపేట, అమరావతి మండలాల్లో కృష్ణానది తీర గ్రామాల (ఇసుక రీచ్‌ల) నుంచి ఇసుక రవాణా చేసేందుకు ఈ రోడ్డు ఒక్కటే ప్రధాన రహదారి. దీంతో రహదారి అవసరాలను గుర్తించిన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అమరావతి- బెల్లంకొండ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ఉపక్రమించారు. ఈ రోడ్డు పనుల్లో భాగంగా అమరావతి నుంచి క్రోసూరు పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడు డ్రైన్లు, చిన్న చిన్న కల్వర్టులు, ఊటుకూరు వద్ద లో లెవల్ బ్రిడ్జి హైలెవల్‌గా నిర్మించటం వరకు పూర్తి చేశారు. 2024 మే నెలలో ఎన్నికల అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోడ్డు పనులు ముందుకు సాగక నిలిచిపోయాయి. దీంతో గ్రామాల నుంచి ప్రయాణాలు చేసే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

■ రోడ్డు పనుల కోసం పాత రోడ్డు మొత్తం తొలగించి గ్రావెల్ వేశారు. దీనిపై భారీ వాహనాలు తిరగటంతో గోతులు ఏర్పడి వేసవి కాలంలో దుమ్ము ధూళి, వర్షాకాలంలో గోతుల్లో వర్షం నీరు నిల్వ ఉండి మరింత అవస్థలు పడుతున్నారు. రోడ్డు పనులు ఎప్పుడు చేస్తారో అని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. డబుల్‌రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బిల్లులు లేటుగా వస్తున్నాయి

చేసిన పనుల తాలూకు బిల్లులు లేటుగా వస్తున్నాయి. దీంతో రోడ్డు పనులు ఆలస్యమవుతున్నాయి. బిల్లులు వస్తే త్వరగా పూర్తి చేస్తాం.

– పున్నారావు, ఆర్ అండ్ బీ, ఏఈ, క్రోసూరు

సకాలంలో కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలి

తహసీల్దార్ కె.నగేష్



రేషన్ డీలర్లతో సమావేశంలో తహసీల్దార్ కె.నగేష్

ముప్పాళ్ళ: మండల పరిధిలోని డీలర్లు నిత్యావసర సరుకులను సకాలంలో కార్డుదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.నగేష్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల రేషన్ డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నగేష్ మాట్లాడుతూ ప్రతి నెల 26వ తేదీ నుంచి 30 వరకు వికలాంగులు, 65 సంవత్సరాలు పై బడిన వారికి డోర్ డెలివరీ చేయాలన్నారు. 1వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మరలా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 వరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా చౌక ధరల దుకాణం మూసి వేయకూడదని, అదే విధంగా పంపిణీ విషయంలో కార్డుదారుల నుంచి అభ్యంతరాలు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్, ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలను సందర్శించిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

పెదకూరపాడు: పెదకూరపాడు మండలంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ మంగళవారం సందర్శించారు. పాఠశాల ఆవరణ, వసతులు విద్యార్థుల భవిష్యత్తుకు ఒక వరం అని తెలిపారు. అటల్ ల్యాబ్, ఒకేషనల్ ల్యాబ్, పీఎంశ్రీలో జరుగుతున్న లైబ్రరీ వర్క్, రాంప్ రైలింగ్, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ప్లే ఫీల్డ్ తదితర పనులను, స్కూల్ క్వాలిటీ ఎసెస్‌మెంట్ ఫ్రేమ్ వర్క్, ఇతర అంశాలను పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలో ఉన్న రైసింగ్ స్టార్ విద్యార్థుల స్థాయిని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం పెరగాలని, సరియైన బోధన ద్వారా మాత్రమే విద్యార్థులు స్థాయి పెంచవచ్చునని ఉపాధ్యాయులకు తెలిపారు. పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి నిలిపి ఉత్తీర్ణత శాతం పెంచాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎంవో పూర్ణచంద్రరావు, ఎంఈవో 2 టి.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరెడ్డి, ఏఈ అనుముల శ్రీనివాస రెడ్డి, క్లస్టర్ సీఆర్ఎంటీ శివ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవరెడ్డి

ముప్పాళ్ళ: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అబద్ధపు హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి విస్తృత సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న డాక్టర్ సుధీర్‌భార్గవరెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సూపర్‌సిక్స్ హామీలు అడిగితే రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులు పెడుతున్నారని, కేసులకు భయపడే వాళ్లు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కాదని, ప్రతి గ్రామానికి వెళ్లి కూటమి నాయకుల అబద్ధపు హామీలను వివరించాల్సిన సమయం వచ్చిందన్నారు. తాను కూడా గ్రామాల్లో పర్యటిస్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సత్తెనపల్లి పర్యటనతో కూటమి నాయకుల్లో భయం పట్టుకుందని, పర్యటన విజయవంతం కావటాన్ని తట్టుకోలేకే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఇందూరి నరసింహారెడ్డి, పార్టీ నాయకులు రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, యనమాల సింగయ్య, ఎస్సీ సెల్ నాయకుడు రమేష్, మైనార్టీ సెల్ నాయకుడు హుస్సేన్, ప్రభాకరరెడ్డి, సైదా తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు, అనంతవరం గ్రామాల్లో ఏవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కౌలు రైతులు తప్పకుండా సీసీఆర్సీ కార్డులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని గాని, గ్రామ రెవెన్యూ అధికారిని గాని సంప్రదించి పొందాలని తెలిపారు. రైతులు పంటలు వేసిన వెంటనే పంట నమోదు చేయించుకోవాలని కోరారు. పంటల బీమా పథకంకు సంబంధించి కంది, మిరప పంటలకు జూలై 31వ తేదీ వరకు వరి పంటకు ఆగస్టు 15వ తేదీ వరకు గడువు ఉందని అన్నారు. దొడ్లేరు గ్రామంలో వరి నారుమడిని రైతులతో కలిసి పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లింపు గడువు పొడిగింపు



మాట్లాడుతున్న ఏవో వెంకటేశ్వర్లు

అచ్చంపేట: పంటల బీమా గడువు ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు ఏవో పి.వెంకటేశ్వర్లు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడువాయిలో మంగళవారం ఆయన రైతులతో మాట్లాడారు. పత్తి పంట బీమా ప్రీమియం చెల్లింపుకు జూలై 31 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని తెలిపారు. పత్తి పంటకు ఎకరాకు రూ.1,900, మిర్చికి రూ.360 చెల్లించవలసి ఉంటుందన్నారు. బీమా ప్రీమియం చెల్లించిన వారికే పంట నష్ట పరిహారం ఇవ్వబడుతుందని చెప్పారు. గ్రామంలో పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శివానాయక్, నబియా, బాలునాయక్, వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలి



ఏసీడీపీవోకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

సత్తెనపల్లి: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్, లబ్ధిదారుల ఫేస్ యాప్ రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)ప్రాజెక్ట్ కార్యదర్శి అహల్య డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ ఏసీడీపీవో సంతోషికుమారికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అహల్య మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదన్నారు. సర్వర్, సిగ్నల్, యాప్‌ల భారంతో ఫోన్‌లు పాడైపోయాయని, లబ్ధిదారులకు టీహెచ్‌ఆర్ ఇచ్చే సమయంలో సమస్యలు తలెత్తుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఉపాధ్యక్షురాలు జ్యోతి, కోశాధికారి అంజని, గౌరవాధ్యక్షుడు పెండ్యాల మహేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేరళను మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన మహనీయుడు అచ్యుతానందన్

సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్



అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: కేరళ రాష్ట్రాన్ని మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన మహనీయుడు కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతి దేశానికి, సీపీఎం ఉద్యమానికి తీరనిలోటని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.విమల అధ్యక్షత మంగళవారం జరిగిన అచ్యుతానందన్ సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అచ్యుతానందన్ చదువు పాఠశాల వరకే పరిమితమైనప్పటికీ, సీపీఎం ఉక్కు క్రమశిక్షణే ఆయనను ముఖ్యమంత్రి స్థాయి వరకు తీసుకువెళ్లిందన్నారు. పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉండే ఆంతరంగిక పోరాటం చేశారన్నారు. అచ్యుతానందన్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటన్నారు. సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య మాట్లాడుతూ అచ్యుతానందన్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. ముందుగా అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాప సభలో సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, నాయకులు శివదుర్గారావు, వీరబ్రహ్మం, సూర్యప్రకాశరావు, సుసులోన్, ప్రభాకర్, రాజ్‌కుమార్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు అగ్రనేత అచ్యుతానందన్‌కు నివాళి

అమరావతి: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతికి మండల సీపీఎం పార్టీ మంగళవారం ఘన నివాళులర్పించింది. ఈ సందరర్భంగా మండల సీపీఎం కార్యదర్శి, బి.సూరిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఎం అగ్రనేత అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. విద్యార్థి దశ నుంచి కేరళ రాష్ట్రంలో ప్రావిన్స్ జమిందారీ పాలనకు వ్యతిరేకంగా రైతుల విముక్తి కోసం పోరాటం చేసిన యోధుడన్నారు. భూస్వాముల దోపిడీకి గురవుతున్న రైతులు, కార్మికులను, చైతన్యం చేసి పోరాడన్నారు. కేరళ ముఖ్యమంత్రిగా, సీపీఎం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా, 7 సార్లు ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నాయకుడిగా పార్టీకి, కేరళ రాష్ట్రానికి అచ్యుతానందన్ సేవలు చిరస్మరణీయమన్నారు. తొలుత అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సయ్యద్ మొహిద్దీన్‌వలి, నండూరి వెంకటేశ్వరరాజు, సుబ్రమణ్యం, రఫీ, పాములు, నాగబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి వార్షిక మహోత్సవం



అమ్మవారి ఊరేగింపులో భక్తులు

సత్తెనపల్లి: పట్టణంలోని 30వ వార్డు పరిధిలో కనకదుర్గ స్వరూపిణి అంకమ్మ తల్లి అమ్మవారి 12వ వార్షిక వేడుకలు మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ నెల 19 నుంచి వార్షిక వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళవారం లోక కల్యాణార్థం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి జగత్ స్వరూపిణి కనకదుర్గ స్వరూపిణి అంకమ్మ తల్లి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామాజిక ఉద్యమాలకు ఆద్యుడు దాశరథి

పెదకూరపాడు: తన రచనల ద్వారా సామాజిక ఉద్యమాలకు ఆద్యుడిగా ఉన్న కవి, రచయిత దాశరథి అని ప్రజా కవి, పీడీఎఫ్ కన్వీనర్ దర్శి శేషారావు అన్నారు. మంగళవారం పెదకూరపాడులోని కచేరి సెంటర్లో దాశరథి జయంతి వేడుకలు పెదకూరపాడు అభివృద్ధి వేదిక (పీడీఎఫ్) ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మాజీ యార్డ్ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాలరావు మాట్లాడుతూ తెలంగాణ విముక్తి కోసం తన రచనల ద్వారా ప్రజలను చైతన్య పరిచారన్నారు. రిటైర్డ్ హెడ్‌మాస్టర్ వీరయ్య, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిజాం పాలకుల చేతిలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కోల్పోయిన ప్రజలను తన రచనల ద్వారా జాగృతం చేశారన్నారు. కార్యక్రమంలో ఎం.మస్తాన్‌రావు, అప్పారావు, శ్రీను, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన సరోజ



రాజుపాలెం: రాజుపాలెం మండల తహసీల్దారుగా ఎస్.సరోజ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సరోజ అచ్చంపేట తహసీల్దారుగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన దుర్గేష్‌రావును సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంకు బదిలీ చేశారు.

పంటకు ముందుగా పశువుల ఎరువులను చల్లాలి

ఏడీఏ మస్తానమ్మ



మాట్లాడుతున్న ఏడీఏ మస్తానమ్మ

రాజుపాలెం: పంటలకు ముందుగా పశువుల ఎరువును గానీ, పచ్చిరొట్ట ఎరువులు గానీ భూమిలో చల్లి కలయదున్నినట్లయితే భూమికి పోషకాలు అందుతాయని క్రోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు మస్తానమ్మ తెలిపారు. మండలంలోని అంచులవారిపాలెం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సూక్ష్మధాతు పోషక లోపాల నివారణకు ముందస్తుగా దుక్కిలో, దమ్ములో ఎకరాకు 20 కిలోల ముడి జింక్ చల్లినట్లయితే జింకుధాతు లోపాలు రాకుంగా నివారించవచ్చని తెలిపారు. ఏవో పి.వెంకటనర్సయ్య మాట్లాడుతూ పత్తి పంటకు ఈ నెల 30వ తేదీలోపు ఇన్సూరెన్సు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు స్వరూప, శ్రీనివాస్, షరీఫ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బీటీ పత్తి విత్తనాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి

సత్తెనపల్లి: గ్రామాలలో ఎవరైనా బీజీ 3 లేదా గ్లైసెల్ బీటీ పత్తి విత్తనాలు విక్రయిస్తే మోసపోయి వారివద్ద కొనుగోలు చేయవద్దని, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఏవో బి.సుబ్బారెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల, గోగులపాడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజీ 3 పత్తి విత్తనాలు సాగు చేయటం వలన భూమికి హానికరం అని, అటువంటి విత్తనాలు అమ్మకాలు జరిపే వ్యక్తులు ఎవరైనా గ్రామాలలో సంచరిస్తే వెంటనే తెలియ చేయాలన్నారు. మిరప సాగు చేసే రైతులు షేడ్‌నెట్‌లలో నారు పెంచుకోవాలన్నారు. మండల పరిధిలో పత్తి సాగు చేసే రైతులు పంటల బీమా చేసుకోవాలన్నారు. ఎకరాకు ప్రీమియం రూ.1,900 చెల్లించాలన్నారు. వ్యవసాయ రుణం పొందిన రైతులు బ్యాంకు ద్వారా బీమా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. వ్యవసాయ రుణం పొందని రైతులు రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రెంటపాళ్ల గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆంజనేయులు, ఏఈవో జానీబాషా, వీఏఏ ప్రశాంత్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

దమ్మాలపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బీవీ నారాయణ పాల్గొని కౌలు రైతులు పంటసాగు హక్కు పత్రాలు పొందాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు పత్తి పంట బీమా గడువు పొడిగించారని, పత్తి రైతులు ఎకరాకు ప్రీమియం రూ.1,900 చెల్లించాల్సి ఉందన్నారు. వ్యవసాయ రుణం పొందిన రైతులు బ్యాంకు శాఖ ద్వారా భీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. పశు వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ రైతులు పశువులకు సకాలంలో టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏవో దేవదాసు

పచ్చిరొట్ట ఎరువుతో భూసారం పెంపు

నకరికల్లు: పచ్చిరొట్ట ఎరువుల సాగు ద్వారా ప్రధాన పంటలో 25 శాతం రసాయనిక ఎరువుల వాడకం తగ్గించవచ్చని ఏవో కె.దేవదాసు సూచించారు. మండలంలోని చల్లగుండ్ల, చీమలమర్రి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధీకృత డీలర్ వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, విక్రయ రసీదుపై పంటరకము, లాటునెంబరు, అమ్మకం దారుని సంతకం ఉండేలా చూసుకోవాలన్నారు. పచ్చిరొట్ట పైరును సాగుచేసిన రైతులు 45రోజుల లోపు పూతదశలో ఉన్న పైరును రోటోవేటర్ వేసి నేలలో కలియదున్నాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రాజశేఖర్‌రెడ్డి, విజయనరసింహ, ఏఈఓ దిలీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.